విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 14, జూలై 2024

ఏఐటీయూసీలో చేరిన బాల సంజీవుడు

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలం పరిధి లోని జిల్లెల్ల గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ బాల సంజీవుడు ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాల కృష్ణ, మండల అధ్యక్షులు రవి ఆధ్వర్యంలో ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా బాల సంజీవుడు మాట్లాడుతూ కార్మికులకు అండ ఎర్రజెండాను అని, ఎర్రజెండా పని విధానం తనకు నచ్చి ఏఐటీయూసీ చేరడం జరిగిందని తెలిపారు. ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణ మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆనాడు స్వాతంత్ర పోరాటం నుంచి నేటి కార్మికుల సమస్యలు తీర్చడంలో అనేక అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు.

ఉచిత శిక్షణ, మెటీరియల్ పంపిణీ చేయండి

విశాలాంధ్ర - నంద్యాల : టెట్-2024 పరీక్షలు రాస్తున్న మైనారిటీ ఉర్దూ విద్యార్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ తరుపున ఉచిత కోచింగ్, ఉచిత మెటీరియల్ పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ సి.అబ్దుల్ అజీజ్ రాష్ట్ర న్యాయ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫారూఖ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూఖ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో టెట్-2024 హాజరవుతున్న మైనారిటీ ఉర్దూ విద్యార్థుల కొరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీని సంప్రదించి నంద్యాల పట్టణంలో త్వరలో టెట్-2024 ఉచిత కోచింగ్, మెటీరియల్ పంపిణీ చేయుటకు కృషి చేస్తానని తెలిపారు.

ముళ్ళ పొదలు తొలగించండి..

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ, మాయలూరు ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి, భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో ముళ్ళ పొదలు రోడ్డుకి ఇరువైపులా అలుముకున్నాయి. ఈ రహదారుల్లో నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతూ ఉంటాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న తరుణంలో లోపల ఉన్న ప్రయాణికులకు కిటికీలకు ఉన్న అద్దాల ద్వారా ముళ్లపొదలు లోపలికి వెళ్లి తగులుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బీ శాఖ అధికారులు స్పందించి ముళ్ళ పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడదాం..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందానికి దోహదపడతాయని ఓఎన్జీసీ జియోఫిజికల్ పార్టీ చీఫ్ జగదీష్ అన్నారు. శనివారం మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహల ప్రాంతంలో గుహల మేనేజర్ అమర్నాథ్ రెడ్డి, జగదీష్ ఆధ్వర్యంలో బెలుం గుహల సిబ్బందితో కలిసి ఓఎన్జీసీ సిబ్బంది స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలో పడిఉన్న ప్లాస్టిక్ ఖాళీ బాటిల్లు, కవర్లు తదితర వాటిని వేరి వేశారు. ఎంతోమంది పర్యాటకులు గుహలను చూడడానికి వస్తుంటారని తమతో పాటు తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్లు బాటిల్లను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతున్నదన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటరెడ్డి, వెంకటేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం పాటలు

విశాలాంధ్ర - రుద్రవరం : మండలంలోని ఎల్లా వత్తుల గ్రామంలో శనివారం నిర్వహించిన దేవాలయ భూముల కౌలు వేలం పాటలో రూ.1,14 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, నాగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి 49.50 ఎకరాల భూములున్నాయన్నారు. ఇందుకు సంబంధించి గత ఏడాది వేలం పాటలు నిర్వహించగా రూ.4.56 లక్షలు వచ్చిందన్నారు. ఈ ఏడాది రూ.5.70 లక్షలు వచ్చిందన్నారు. ఇందులో రూ 1.14 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఈవో చంద్ర, సర్పంచ్ చంద్రమోహన్, కార్యదర్శి పాములేటి, ఎంపీటీసీ కాశన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర - ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శనివారం టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామ సమీపంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమీప బంధువులు ఏర్పాటు చేసుకున్న కంకర క్రషర్ మిషన్ విషయం లో ఈ ఘర్షణ జరిగింది. ఘర్షణలో మాటా, మాటా పెరిగి టీడీపీ, వైసీపీ నాయకుల పరస్పర దాడిలో టీడీపీ నాయకులు నారాయణ, నడిపి ఓబులేసు, శ్రీనివాసులు, వైసీపీకి చెందిన కృష్ణమూర్తి, శేషు, ఆదినారాయణ, రామరంగడులు గాయపడ్డారు. ఇరు వర్గాలు పరస్పరం కొడవళ్ళు, రాళ్ళు, కర్రలతో దాడులకు తెగపడ్డారు. దీంతో గ్రామ ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ సుధాకర్ రెడ్డి గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి గాయపడ్డ టీడీపీ నాయకులను పరామర్శించారు. అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని అభయమిచ్చారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ముచ్చుమర్రి గ్రామంలో చిన్నారిని అత్యా చారం చేసి, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిం చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి సీపీఐ ఆధ్వ ర్యంలో నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కొవ్వత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి హత్య జరిగి వారం రోజులైనప్పటికి నేటికి మృత దేహాన్ని గుర్తించక పోవడం దారుణమని, పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి కలుగజేసుకున్నప్పటికి ఎలాంటి ఆచూకీ లేదని, నిర్లక్ష్యం వహించిన సీఐని, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మైనర్ బాలికని అత్యా చారం, ఆపై హత్య చేసి మల్యాల ఎత్తిపోతల కాలు వలో పడవేసినట్లు మైనర్ బాలురే చెబుతుంటే ఇంత వరకు అమ్మాయి జాడ కనిపెట్ట లేదన్నారు. ఎంపీ సొంత గ్రామంలో గంజాయి, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభిస్తున్నాయని స్వయంగా కొందరు నాయకులు ఆరోపిస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.మున్ని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గోకారి, సీపీఐ నాయకులు ఎస్ ఖలీల్, చాంద్ బాష, కరీముల్లా, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులు ప్రతి రైతుకు రూ.20 వేలు పంట పెట్టుబడి తక్షణమే అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు అయిందని తక్షణమే రైతుల అకౌంట్లో నిధులు జమ చేసి ప్రభుత్వ హామీని అమలు చేయాలన్నారు. జిల్లాలో దాదాపు 1.36 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులకు మేలు చేసే పథకమని, ఈ పథకం కింద నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వ వాటా కింద రూ.6 వేలు కలిపి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా నాయకులు కె.భాస్కర్, జిల్లా కార్యదర్శి జి.సోమన్నలు పాల్గొన్నారు.

విధి కాటుకు నవ జంట విలవిల

- భార్యను కాపాడే యత్నంలో భర్త దుర్మరణం
- నంద్యాల జిల్లా ఎర్రగుంటలో ప్రమాదం
- నాలుగు నెలల కిందటే ప్రేమ పెళ్లి
- అంతలోనే ఘోర విషాదం

విశాలాంధ్ర - డోన్ రూరల్: కునికిపాటుతో రైలు నుంచి పడిపోతున్న భార్యను కాపాడే ప్రయత్నంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. సహచర ప్రయాణికులను కుదిపేసిన ఈ దుర్ఘటన నంద్యాల జిల్లా డోన్ సమీపంలోని ఎర్రగుంట్ల వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా, చిరూరు ప్రాంతానికి చెందిన సయ్యద్ ఆసిఫ్, అసియా భాను ప్రేమించుకుని, నాలుగు నెలల కిందట పెళ్లి చేసుకున్నారు. గుంటూరు నుంచి బెంగళూరుకు ప్రశాంతి ఎక్స్ ప్రెస్ రైలులో బయలుదేరారు. జనరల్ బోగీలో సయ్యద్ ఆసిఫ్, ఆయన భార్య అసియాబాను ఫుట్ బోర్డుపై కూర్చుని ప్రయాణిస్తుండగా ఎర్రగుంట్ల వద్ద నిద్రమత్తులో రైలులో నుంచి కిందపడి పోయింది. ఈ హఠాత్పరి ణాయంతో ఆసిఫ్ భార్యను కాపాడేందుకు రైలు నుంచి దూకాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఆ మహిళకు తీవ్ర గాయాలు కాగా, రైల్వే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు: వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అధికారికంగా నిర్వహించాలని వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వడ్డే బాల నరసింహుడు కోరారు. శనివారం అఖిలభారత ఒడ్డె ఓబన్న సేవాసమితి రాష్ట్ర, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలుగుదేశం జాతీయ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపరిష్కారాల వేదిక కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలలో వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వడ్డే బాల నరసింహుడు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బివియన్ రాజులు విన్నవించారు. బీసీ డికరేషన్లో ఇచ్చిన ఎస్టీ కొరకు అసెంబ్లీలో తీర్మానం, వడ్డెరలకు క్వారీలలో రిజర్వేషన్, 50 ఏళ్లకే వడ్డెరలకు పెన్షన్ ఏర్పాటు, స్వయం ఉపాధి రుణాలు, పనిముట్లు జేసీబీలు, బ్లాస్టింగ్ పరికరాలు, క్రషింగ్ మిషన్లు సబ్సిడీలో అందించి వడ్డేర్లను ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సంపంగి శివకృష్ణ, కుంచెపు చిన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున, ప్రచారకార్యదర్శి కేతన సురేష్ పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్య దర్శి శివ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం బేతంచెర్ల లో జరిగే జిల్లా సమావేశానికి ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్ బాష, ప్రధాన కార్యదర్శి సుబ్బారావుల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 12న విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ పునురుద్దరణకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి జీపీఎస్‌ను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేసిందని, ఎస్టీయూతోపాటు పలు సంఘాలు చేసిన ధర్నాల వల్ల తాత్కాలికంగా ఆ జీవోను పక్కన పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2017లో మెమో నెంబర్ 57ను యధాతధంగా అమలు చేసి, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ పునరుద్ధరింప చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్ బాష, జిల్లా కౌన్సిలర్ సురేషప్ప, సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్ర కుమార్, ఆర్థిక కార్యదర్శి ఆర్థిక కార్యదర్శి మాబుహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుమర్రిలో బాలికపై జరిగిన సంఘటన బాధాకరం

విశాలాంధ్ర - నంద్యాల : ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై జరిగిన సంఘటన బాధాకరమని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక గజ్జనీ నగర్ లోని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ మౌలానా అబ్దుల్ సలాం మాట్లాడుతూ ముచ్చుమరిలో బాలికపై జరిగిన అత్యాచారం దురదృష్టకరమని, రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, అధికారులు కళ్ళు తెరవకపోవడం, దీనిపై చర్యలు తీసుకోకపోవడం బాధకరమని ఆయన వెల్లడించారు.

అలరించిన ధాత్రిరెడ్డి భరత నాట్యం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఓబులంపల్లె గ్రామానికి చెందిన ఎన్నారై, టిడిపి నాయకులు గౌరు రామకృష్ణారెడ్డి కూతురు ధాత్రి రెడ్డి సనాతన భారత సాంస్కృతిక కార్యక్రమాలైన భరతనాట్యం, అరంగేట్రం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రెడ్డి, కేంద్ర కాటన్ బోర్డు సభ్యులు, టీడీపీ నాయకులు సిపి శ్రీనివాసరెడ్డి (వాసు) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధాత్రి రెడ్డి భరతనాట్యంలో అన్ని కళలను అభినయించారు. ధాత్రి రెడ్డి భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అఖిల ప్రియ ధాత్రి రెడ్డిని అభినందించారు. భరతనాట్యంలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆమెను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌరు రామకృష్ణారెడ్డి కుటుంబం విదేశాల్లో ఉన్న మన సంస్కృతిని నేర్చుకొని, పుట్టిన ఊరిలో, మన ప్రాంతంలో అరంగ్రేటం చేయాలన్న ఆలోచన రావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా గౌరు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీవీ రామిరెడ్డి, బాచ్చపురం శేఖర్ రెడ్డి, బంగారు రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మారిటైం బోర్డును సందర్శించిన మంత్రి బీసీ

విశాలాంధ్ర - బనగానపల్లె : మంగళగిరిలోని ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్‌లోని ఏపీ మారిటైం బోర్డు ఆఫీస్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖల మంత్రి బీసీ జనార్ధన రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సంద ర్భంగా ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీల్ కుమార్, ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్స్‌పల్ సెక్రటరీ యువరాజ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో మారిటైం బోర్డ్ ఆఫీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొహరం వేడుకలు జరుపుకోవాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రశాంత వాతావర ణంలో మొహరం పండుగ వేడుకలను జరుపుకోవాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జరిగే మొహరం వేడుకల్లో ఎవరైనా అలజడులు సృష్టించిన, గొడవలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో అతి ఉత్సాహం ప్రదర్శించిన, గొడవలకు రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పీర్ల ఉత్సవాల సమయంలో ఎలాంటి మారణాయుధాలు కనిపించిన,తీసుకొని తిరిగిన అట్టి వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ యూనస్, గ్రామ పెద్దలు గుత్తి నర్సింహులు, రఫి, కొలిమి హుసేన్‌వలి, సల్లానాగరాజు, హనీఫ్, వేణు గోపాల్ రెడ్డి, రామసుబ్బయ యాదవ్, సత్యనారాయణ, అజీం, భాస్కర్ రెడ్డి, అజీం, జిలాన్, మధు, షఫి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దు

విశాలాంధ్ర - నంద్యాల : టీడీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని, వైసీపీ కార్యకర్తలు, నాయకులపై దాడుల సంస్కృతికి చరమగీతం పాడాలని నంద్యాల వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధులు శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, కృష్ణారెడ్డి, విజయశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానికి వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైసీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో విధ్వంసాలు, వైసీపీ చెందిన శిలా ఫలాకాలు, విగ్రహాలు, కార్యకర్తలు, నాయకులపైన దాడులను చేస్తూ దౌర్జన్యాలు, దాడుల సంస్కృతికి తెరతీయడం జరిగిందని, ఇది సరికాదన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం 151 సీట్లను సాధించి ప్రభుత్వాన్ని చేపట్టిందని, టీడీపీ మాదిరిగా దౌర్జన్యాలు, దాడులను చేయలేదన్నారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణమరాజు తాజాగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై కక్ష పూరితంగా కేసులను పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు.

అందుబాటులో నీలి నాలుక వ్యాక్సిన్

విశాలాంధ్ర - అవుకు: మూగ జీవాల్లో వచ్చే నీలి నాలుక వ్యాధికి సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉందని మండల పశువైద్యాధికారి డాక్టర్ భారతీదేవి అన్నారు. శనివారం మండలంలోని మన్నే నాయక్ తండాలో జీవాలకు నీలి నాలుక వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీలి నాలుక వ్యాధి అనేది గొర్రెలు, మేకల్లో కనిపించే వైరల్ వ్యాధి అన్నారు. ఈ వ్యాధి సోకిన జీవాల్లో నాలుక నీలిరంగులోకి మారుతుందని, అధిక జ్వరం రావడం, నోటి లోపల పూతలు, గాయాలు కావడం, నోటి నుండి నీరు ఎక్కువగా కారడం, కాళ్లలో నొప్పి, వాపు శ్వాస తీసుకోవడం ఇబ్బంది పడటం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. వ్యాధి నివారణ కొరకు వ్యాక్సిన్ వేయించడం, పోషకాహారాన్ని అందించడం, జంతువుల నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, కీటకాలను నియంత్రించడం ద్వారా వైరస్ వ్యాప్తిని తగ్గించవచ్చు అన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యాధికారిణి సంప్రదించి వ్యాక్సిన్ వేయించాలని అన్నారు.

ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే కోట్ల

విశాలాంధ్ర - నంద్యాల : ఉద్యోగుల సమస్యలను టీడీపీ ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. బేతంచెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశం ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, అజాం బేగ్‌ల అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 117 జీవోను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేస్తుందని, సీపీఎస్ రద్దుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఉద్యోగులతో సంప్రదింపులు చేస్తుందన్నారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలను చెల్లించడానికి, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమం కొనసాగించడానికి, ఉపాధ్యాయులకు పని భారం తగ్గించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కార్యచరణ రూపొందిస్తుందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం సీపీఎస్‌కు మెరుగైన విధానం అమలు చేయకుండా జీపీఎస్‌పై గజిట్ విడుదల చేయటాన్ని ఎస్టీయూ సంఘం తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉపాధ్యా యులకు పని భారం తగ్గించి, ఒక సెక్షన్‌లో 45 మంది విద్యార్థులకు మించితే రెండవ సెక్షన్ మంజూరు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించి, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయులు నియమించి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఈ ప్రభుత్వం సహకరించాలని కోరారు. డోన్ పట్టణంలోని ఎన్ఎన్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు టి.సురేష్ బాబు గత 31 ఏళ్లుగా కృషి చేసి తాను రచించిన విప్లవ జ్యోతి అనే అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర పద్య కావ్యాన్ని ఎమ్మెల్యే, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్‌లతో ఆవిష్కరింజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శులు గోపాలకృష్ణ, ఇగ్బాల్ బాష, మాజీ రాష్ట్ర సహాధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శివ ప్రసాద్, సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్ర కుమార్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సుబ్బయ్య, చెన్నవరెడ్డి, సీనియర్ నాయకులు, వివిధ కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వజన వైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి
- సర్వజన వైద్యశాల తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర - నంద్యాల : ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు వార్డులను కలియతిరిగి రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తూ వైద్యాధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో పాటు అత్యవసరమైన మందులను సరఫరా చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎంసీహెచ్ బ్లాక్‌లో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాల్సిన సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హాస్పిటల్ లోని పలు వార్డులను తనిఖీ చేస్తూ సంబంధిత విభాగాల డాక్టర్లను అడిగి సమస్యలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని ఎంసిహెచ్ బ్లాకు, క్యాజువాలిటీ, ఔట్ పేషంట్, ఇన్ పేషెంట్, లేబర్ రూమ్, ఎస్ఎన్‌సీయూ తదితర విభాగాలను పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి తనిఖీలో భాగంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలన్నారు. జిల్లా నలుమూలల నుండి డాక్టర్లపై ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి వారిని ఆదుకోవాలని డాక్టర్లకు సూచించారు. వైద్యుల కొరత తక్కువగా ఉందని కార్డియాలజిస్ట్, సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల కొరత ఉందని కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ డా.జఫరుల్లా, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలి-సీపీఐ

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : మండలంలోని నాగనాథనహల్లి గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు భూ వివాదంలో గుండమ్మపై ట్రాక్టర్ తో తొక్కించి హత్యకు పాల్పడడం దారుణమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, సీపీఐ నాగనాథనహల్లి గ్రామ శాఖ కార్యదర్శి సిద్దలింగ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.శనివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు మీడియాతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ఆదోని పరిసర గ్రామాల్లో అగ్రవర్ణాల వ్యక్తులు అధికార మదంతో నియంత వైఖరితో దౌర్జన్యాలు హత్య రాజకీయాలకు పాల్పడడం సభ్య సమాజం తలదించుకునే పద్ధతుల్లో పూనుకోవడం సిగ్గుచేటన్నారు. దళిత మహిళ మాదిగ గుండమ్మపై విచక్షణ రహిత్యాన్ని కోల్పోయి హత్యకు పాల్పడడం, అడ్డుగా వెళ్లిన కొందరు వ్యక్తులపై కూడా హత్య ప్రయత్నం చేయడం సరికాదన్నారు.హత్యకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన మాదిగ గుండమ్మ కు ఆర్థిక సహాయంతో పాటు పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిపిఐ పార్టీ మండల సమితి తరపున ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యశోద నర్సింగ్ హోమ్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరంలో కొత్త బస్టాండ్ సమీపం లో ఉన్న యశోద నర్సింగ్ హోమ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, నగ ర కార్యదర్శి బిసన్నలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఆర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యశోదనర్సింగ్ హోంలో గర్భిణీ స్త్రీలకు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ అవసరమైతే వారు అడిగినంత డబ్బులు ఇస్తే భృణ హత్య కూడా చేయడానికి వెనుకాడడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని వారు చెప్పారు. ఈ విషయంపై శుక్రవారం ఏఐవైఎఫ్ నాయకులు యశోదనర్సింగ్ హోం యాజమాన్యాన్ని సంప్రదించగా మొదట అలాంటివేమి జరగట్లేదని బుకాయించారని, తమవద్ద పక్క ఆధారాలున్నాయని గట్టిగా వాదించేసరికి నగరంలో మా హాస్పిటల్లోనే చేస్తున్నామా? అన్ని హాస్పిటల్ చేస్తున్నాయని ఏం చేసుకుంటారో చేసుకోండనేలా సమాధానం ఇచ్చారని వారు తెలిపారు. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలు మాకు పట్టవు అన్నట్టుగా 6,7 నెలల్లో అబార్షన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ఇది క్షమించరానిదని, లింగ నిర్ధారణ నేరమని ప్రభుత్వాలు చెబుతున్న ఇంత బహిరంగంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న జిల్లా వైద్యశాఖాధికారులు ఏంచేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు.ఈ హాస్పిటల్‌లో చేసిన లింగనిర్ధారణ పరీక్షలపై సరైన ఆధారాలతో సోమవారం జిల్లా వైద్యశాఖాధికారులతో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ నిబం ధనలు పాటించకుండా లింగ నిర్ధార పరీక్షలు ప్రోత్సహిస్తున్న యశోదనర్సింగ్ హోంపై చట్టపరమైన చర్యలు తీసుకునేంతవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. నగర అధ్యక్షులు బాబయ్య, సురేంద్ర,కాసిం, కుమార్ పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర-ఆదోనిరూరల్: నంద్యాల జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండలంలోని కుప్పగల్ క్రాస్ వద్ద వాల్మీకి సర్కిల్లో వాల్మీకి సంఘం నాయకులు గనేకల్ పరమేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు గణేకల్ పరమేష్, బల్లెకల్ సీతారామయ్య, కుప్పగల్ సూరి,వెంకటేష్ పాడేగల్ హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ మానవ మృగాలు కామముతో కొట్టుమిట్టాడుతూ మైనర్ బాలికలపై, వృద్ధులపై వయసుతో సంబంధం లేకుండా హత్యకు ఒడి కట్టడం ప్రపంచ దేశాల తలదించుకునే విధంగా సిగ్గుమాలిన చర్యకు పాల్పడడం దారుణం అన్నారు. అన్యం పుణ్యం మెరుగని పసి పిల్లలపై అత్యాచారానికి పాల్పడి మృతదేహాన్ని ఆచూకీ లేకుండా చేసిన కామాంధులకు కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.మైనర్ పిల్లలపై జరుగుతున్న హత్యలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లోన ప్రతి తరగతిలో జీవితం పట్ల ఒక పిరీదులో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఇలాంటి అఘాయిత్యాలు పునరావృతం కాకుండా హోంశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిగ్రామంలో ప్రతి వార్డులలో పిల్లల పెంపకం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలను పోలీస్ వ్యవస్థ ద్వారా నిర్వ హించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హత్యకు గురైన మైనర్ బాలిక కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేసియా కల్పించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అమిలియో వైద్యుల నిర్లక్ష్యం.. యువకుడు మృతి

ఏకంగా మృతుడి పేరునే మార్చేసిన వైద్యశాల నిర్వహకులు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : కర్నూలు అమిలియో వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు తెలంగాణా రాష్ట్రంలోని గద్వాల జోగులాంబ జిల్లా పైపాడు గ్రామానికి చెందిన రాజేష్ (30) కుటుంబ సభ్యులతో కలసి ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు డివైడర్‌ను ఢీ కొనడంతో రాజేష్‌తో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గతవారంలో కుటుంబసభ్యులు కర్నూలు అమిలియో వైద్యశాలకు తరలించారు. ఈప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న రాజేష్‌కు తగిలింది చిన్నపాటి గాయాలే.. ఆయన వెంట ఉన్న మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని ఆయన బంధువులు విశాలాంధ్ర ఎదుట విలపిస్తూ వాపోయారు. కడుపులో గాయాలున్నాయనీ రెండు రోజుల క్రితం శస్త్రచికిత్స చేసి కుట్లు వేశారనీ, అక్కడి వరకు ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ శనివారం అకస్మాత్తుగా మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందని బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఏకంగా మృతుడి పేరునే మార్చిన వైద్యశాల నిర్వహకులు

మృతుడు అసలు పేరు రాజేష్ కాగా, హనుమంతుగా తప్పుగా కె షీట్‌లో నమోదుచేశారని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేష్ మృతిపై ఆరోగ్యశాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు నిగ్గుతేల్చి వైద్యశాల నిర్వహకులపై కేసులు నమోదు చేసి.. కఠినంగా శిక్షించడంతో పాటు తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. ఈసంఘటనపై వైద్యశాల నిర్వహకులు చాపే లక్ష్మి ప్రసాద్‌తో పాటు మేనేజరు రమేష్‌బాబును చరవాణిలో సంప్రదించగా వారి ఇరువురి చరవాణులు తీయలేదు. మరో 2 గంటల తర్వాత మేనేజరు చరవాణి పూర్తిగా స్విచ్ ఆఫ్‌తో మరింత అనుమానాలకు తావిస్తోంది.

కర్నూలు రైల్వేస్టేషన్ ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : కర్నూలు రైల్వేస్టేషన్ ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం ఎంపి హోదాలో మొదటి సారి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఆయన.. స్టేషన్ మేనేజర్ శేషఫణి తో కలిసి రైల్వేస్టేషన్ ను పరిశీలించారు. అనంతరం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద చేపడుతున్న పనులను తనిఖీ చేసి, పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగుల హెచ్.ఆర్.ఏను 10 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని, కర్నూలు-విజయవాడకు ప్రత్యేక రైలును వేయాలని అధికారులు ఎంపిని కోరారు.అనంతరం ఎంపి మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో ఎలాంటి సమస్యలున్నా తమదృష్టికి తీసుకురావాలని, కేంద్ర మంత్రులుతో చర్చించి వాటిని పరిష్కరిస్తానన్నారు. ఇకప్రజలు రైల్వే సేవలు వినియెగించుకోవాలని ఆయన కోరారు..ఈకార్యక్రమంలో స్టేషన కమర్షియల్ ఇన్స్పెక్టర్ మునాజీ రావు, సర్వీస్ ఇంజినీర్ శివలు పాల్గొన్నారు

మరో ఈత కొలను ఏర్పాటుకు కృషి చేస్తా..!

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నగరంలో ప్రస్తుతం ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ అభివృద్ధితోపాటు మరో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు అవసరమైన కృషి చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం కర్నూల్ నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ లో ఏర్పాటు చేసిన 9వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ ఛాంపియన్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు తోపాటు స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ 1974లో తాను కర్నూలుకు వచ్చిన కొత్తలో స్విమ్మింగ్ పూలు నిర్మాణం జరుగుతున్న సమయంలో తన సహకారం కోరారని, తాను కూడా అందుకు సహకరించానని వివరించారు. స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ప్రతిఅభివృద్ధిలో తనభాగస్వామ్యం ప్రత్యక్షంగా పరోక్షంగా ఉందని టీజీ తెలియజేశారు. కర్నూల్ నగరంలోని స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ రాష్ట్రంలోనే అత్యుత్తమ అసోసియేషన్‌గా కార్యక్రమాలు నిర్వహిస్తుందని కొనియాడారు. ఏకార్యక్రమం చేపట్టాలన్న అందుకు అవసరమైన కృషి ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పోటీలకు సంబంధించి బహుమతుల ప్రధానానికి అయ్యే రూ.50 వేలు మంత్రి టీజీ భరత్ పేరు మీద తాను అందజేస్తానని తెలియజేశారు. ఈ పోటీల విజేతలకు తన కుమారుడు టీజీ భరత్ పేరు మీద బహుమతులు అందజేయాలని సూచించారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఆదోని : మండల పరిధిలోని ఇస్వీలో విద్యుదాఘాతానికి గురైన హుసేనినిపరామర్శించి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు రూ.25వేల ఆర్థిక సాయం అందజేసినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు సూర్యనారాయణ, యువనాయకుడు మారుతి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు కష్టం వస్తే ఎల్లా వేళల ఆదుకోవడానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆ కుటుంబానికి భరోసానిస్తూ త్వరగా బాలుడు కోలుకోవాలని భగవంతుని ప్రార్థించడం జరిగిందన్నారు.నరహర రెడ్డి, వెంకట్రాముడు పాల్గొన్నారు.

దళిత మహిళను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-ఆస్పరి : ఆదోని మండల పరిధిలోని నాగనాథనహళ్లికి చెందిన దళిత మహిళ గుండమ్మను అధికార పార్టీ ప్రొద్బలంతో హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది డిమాండ్ చేశారు. శనివారం ఆస్పరిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం విషయంలో తన దగ్గర పొలాన్నికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయని ఆ పొలంలో మీకీ భాగం ఉంటే పొలం అమ్మిన తిరులమ్మతో మాట్లాడుకోవాలని ఆమె చెప్పిన పట్టించుకోకుండా గుండమ్మను ట్రాక్టర్‌తో తొకించి చంపడం హేలమైన అనాగరిక చర్య అన్నారు. గుండమ్మను ఈ విధంగా హత్య చేయడం చాలా బాధాకరమని, హత్య చేసిన రాఘవేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మరియు అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకొని గుండమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు, ఐదెకరాల భూమి, వారి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈసంఘటనపై జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అయన హెచ్చరించారు. ఈసమావేశంలో మాల మహానాడు నాయకులు వీరేష్, రంగస్వామి, హరికృష్ణ, బంగారు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులు హక్కుల కోసం పోరాడాలి

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: తరతరాలుగా నదులు చెరువులు గ్రామాల్లోచేపలు పట్టి జీవించే మత్స్యకారులు సమస్యల పరిష్కారానికి మత్స్య కార్మికులు ఐక్యంగా ఉద్యమించి సాధించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి నాగాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం నందవరం మండలంలో జిల్లా అధ్యక్షులు ఏ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన మత్స్యకారుల సంఘం జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నాగాంజనేయులు, చేతి ఉత్తుదారుల ఏపీ రాష్ట్ర కార్యదర్శి కే రామాంజనేయులు,మత్స్య కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కే రంగనాథులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పి నాగాంజనేయులు మాట్లాడుతూ సముద్ర 15 జాతికాల్లో సాంప్రదాయంగా వృత్తిని కొనసాగిస్తున్న మత్స్య కార్మికుల ఉపాధిని దెబ్బ తీసే విధంగా సముద్రములో 30 కిలోమీటర్లు వరకు వెళ్లి వేట కొనసాగించే విధానం వల్ల మత్య సంపదను దోచుకుని పర్యవరనాన్ని దెబ్బతీసేవిధంగా రాజకీయయం జోక్యం తో మత్స్య కార్మికులవృత్తి కి స్వస్థి చెప్పేవిధంగా జీవితాలను దోచుకునే విధంగా మత్స్య కార్మికుల కడుపుకొడుతున్నారన్నాని విమర్శించారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం గత ప్రభుత్వం జీవో నెంబర్ 144,217ను రద్దు చేయడం హర్షనీయమని తెలిపారు.

మత్య కార్మికులందరి గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు సంఘం పాటుపడుతుందని తెలిపారు.చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజ నేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు రకాల చేతివృత్తిదారులు, వ్యవసాయ రంగంలో,ఉత్పత్తి రంగంలో సేవారంగంలో పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు సహకారం లేక చేతివృత్తుదారులు వదిలి వేస్తున్నారన్నారని వారు తెలిపారు. వృత్తుల వారిగా చైతన్య పరిచే తమ హక్కుల సాధన కోసం పోరటలకు చేతివృత్తిదారులకు అంతగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మత్స్యకారిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రంగనాథ్ ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపనగౌడ్, బసవన్న ,నటరాజు, సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, ఆదోని మత్స్యకారుల సంఘం నాయకులు నర్సింలు సంఘం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: వైద్య రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. జీవో నెంబర్ 549 ప్రకారం శానిటేషన్ కార్మికులకు నెలకు రూ.16వేలు, జీవో నెంబర్ 43 ప్రకారం సెక్యూరిటీ గార్డ్సకు రూ.11వేలు, ఆరోగ్య మిత్ర బ్లడ్ బ్యాంక్ ఆపరేటర్లకు, జీడిఏ సిబ్బందికి కనీస వేతనం 24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కోస్ లో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వైద్య రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు అమలు చేయాలని,ఈఎస్ఐ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, గుండు భాష,కాంట్రాక్ట్ ఉద్యోగులు దేవయ్య, ఆనంద్ కుమార్, భూషయ్య, సుభాన్, నారాయణస్వామి, గురు స్వామి, సురేష్, రాజేశ్వరి, చంద్రకళ, లక్ష్మి, విశాల, సుంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-వెల్దుర్తి: ఏఐటీయూసీ ఏపీ అంగన్వాడి వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, జిల్లా అధ్యక్షురాలు ఎస్.చాందిని, మండలఅధ్యక్షుడు బి.మాధవ స్వామి ల ఆధ్వర్యంలో సమావేశ కార్యక్రమం ఎడ్యుకేషన్ మంత్రి లోకేష్, గుమ్మడి సంధ్యారాణి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి మన పరిస్థితులు సమస్యలు, ప్రభుత్వము యంత్రాంగం పరిస్థితులని సానుకూలంగా వ్యవహరించారని జె.లలితమ్మ తెలిపారు. అనంతరం అంగనవాడి నూతన కమిటీ ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులు మాధవస్వామి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు, అధ్యక్షురాలు సంధ్యారాణి, గువ్వలకుంట్ల ఉపాధ్యక్షులు శాంత, కలుగొట్ల, యశోద,టీ.గోకులపాడు,ప్రధానకార్యదర్శి యు.సుజాత, మాదాపురంసహాయ కార్యదర్శులు నాగమద్దమ్మ, గోవర్ధనగిరి రేణుక, వెల్దుర్తి ట్రెజరర్ వెల్దుర్తి కమిటీ మెంబర్స్ స్వర్ణలత, పుష్పవతి, క్రిష్ణగిరి సెక్టార్ శంకరమ్మ, సురేఖ ,కంబాలపాడు సెక్టార్, షమీనా, రామలక్ష్మి వెల్దుర్తి లోకల్ లక్ష్మీదేవి, పద్మ వెల్దుర్తి టు సెక్టార్ సుగుణ, మహేశ్వరి, రామలకోట సెక్టార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నుకోబడిన వారందరికీ జిల్లా అధ్యక్షురాలు చాందిని, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్ ఈదమ్మ, రాష్ట్రప్రధాన కార్యదర్శి లలితలు అభినందనలు తెలియజేశారు.

దళిత మహిళ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: కర్నూలు జిల్లా ఆదోని మండలంలో పెత్తం దారులు చెలరేగిపోయి భూ వివాదం నేపథ్యంలో దళిత మహిళపై ట్రాక్టర్ ఎక్కించి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డి.హెచ్.పి.ఎస్ జిల్లా కార్యదర్శి పి.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా దళిత మహిళ గుండమ్మను హత్య చేసిన రాఘవేంద్రరెడ్డి, అతని అనుచరులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ డి.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.కార్యక్రమంలో కృష్ణ, దావీదు, సురేంద్ర, లక్ష్మి, సుధాకర్, ప్రేమ్ రాజ్, ఏసన్న పాల్గొన్నారు.

ప్రతిభలో కోచింగ్ తీసుకుంటే జాబ్ కొట్టినట్టే...అందుకే ఇంత రద్దీ

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: జయానికి ప్రతిరూపం ఒకటి ఉందంటే అది ప్రతిభ మాత్రమే. ఇది ఏఒక్క విద్యార్థి అభిప్రాయం లేక తల్లిదండ్రుల మాటో కాదు. ఏ ప్రాంతానికిపరిమితమైన అభిప్రాయం అంతకన్నా కాదు.ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుండి వినిపించే ఒకే ఒక్క పేరు ప్రతిభ. అమ్మలా వేలు పట్టి, నాన్నలా వెన్ను తట్టి భావితర ఉపాధ్యాయుల భవిష్యత్తుకు ప్రతిభ భరోసానిస్తుంది. ఇక్కడ కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకుడు ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. నైతిక విలువలకు విలువిచ్చి ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉద్యోగ సాధనలో వారిలో ఆయన ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులలో వేల మంది ఉద్యోగాలు సాధించారు. ఈకోచింగ్ సెంటర్లో ఉద్యోగాలకు కోచింగ్ తీసుకోవాలంటే పేద విద్యార్థులు పోటీ పడుతుంటారు. 2018 డీఎస్సీ,టెట్ ఫలితాల్లో ప్రభంజనాన్ని సృష్టించింది. డీఎస్సీ తెలుగు మీడియంలో శైలజ 1వ ర్యాంక్(హాల్ టికెట్ నెం.181314400221617), గౌస్‌పీర్ ఇంగ్లీష్ మీడియం1వ ర్యాంక్ (హాల్ టికెట్ నెం.18161060000250) సురేష్ కన్నడ మీడియంలో 1వ ర్యాంకు (హాల్ టికెట్ నెం.18131420000072),అస్మని గర్ ఉర్దూ మీడియంలో 2వ ర్యాంకు (హాల్ టికెట్ నెం.1812143000011 2), సాయి లక్ష్మి3వ ర్యాంక్ (హాల్ టికెట్ నెం.18111440003086), భారతి 4వ ర్యాంక్ (హాల్ టికెట్ నెం.18131440001178), జయరాముడు 4వర్యాంక్ (హాల్ టికెట్ నెం. 18131250001446)లు టాపర్స్‌గా నిలిచారు. 2018 టెట్ ఫలితాల్లో భారతి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, సుప్రజ 3వ ర్యాంక్, గౌస్ పీర్ 4వ ర్యాంకుతో సత్తా చాటారు. ఇక్కడ కోచింగ్ తీసుకోవాలంటే కావలసినది ఫీజు మాత్రమే కాదు, క్రమశిక్షణ పట్టుదల అర్హతగా భావించి వారికి కోచింగ్ ఇస్తూ ఉంటారు. కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో టెట్, డీఎస్సీలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎవరైనా మరింత సమాచారాన్ని తెలుసుకునేందుకు సెల్ 830 946 4906, 99899 116 33 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

హెబ్బటం వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర-హొళగుంద:మండలంలోని హెబ్బటం వీఆర్ఏ పెద్ద తిక్కయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడని ఆర్ ఐ దినోజ్ కుమార్ తెలిపారు వీఆర్ఏ మృతదేహానికి పూలమాలలు వేసి తహసీల్దార్ ప్రసాదరాజు, ఆర్ఐ వినోద్ కుమార్ వీఆర్వో లక్ష్మీనారాయణ రెడ్డిఘనంగా నివాళులర్పించారు.మృతుడి మట్టిఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. వీఆర్ఏ కుటుంబానికి అండగా ఉండి ఉద్యోగం కల్పిస్తామని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. వీఆర్ఏ పెద్ద తిక్కయ్య ప్రభుత్వ పనులతో పాటు ప్రజాసేవ చేసి గ్రామంలో మంచి గుర్తింపు పొందాడని కొనియాడారు. మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు మల్లయ్య, ఉపాధ్యక్షుడు మౌలాలి, సిద్ధలింగప్ప, అశోక్, చెన్నప్పలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

హెల్మెట్ వాడండి-ప్రాణాలు కాపాడుకోండి

విశాలాంధ్ర-పత్తికొండ: ద్విచక్ర వాహనం నడిపే వారు, వెనక కూర్చున్న వారుతప్పకుండా హెల్మెట్ ధరించి, ప్రాణాలను కాపాడుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.ఎస్ భారతి తెలిపారు. శనివారం న్యాయ సేవాధికార సంస్థ, జేసీజే కోర్ట్ జడ్జి ఎంఎస్. భారతి ఆదేశాల మేరకు పత్తికొండలో హెల్మెట్ల వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. న్యాయ సేవాధికారిసంస్థ ప్యానెల్ న్యాయవాదులు సూరజ్ నబి, మధుబాబు పాల్గొన్నారు.

కర్నూలులో కిమ్స్ కడల్స్ సేవలు ప్రారంభం

విశాలాంధ్ర-కర్నూలు : ఇన్నాళ్లు హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన కిమ్స్ కడల్స్ ఆస్పత్రి సేవలు ఇప్పుడు సీమలోని కర్నూలు నగరానికి కూడా తరలివచ్చాయి. కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రిలో కొత్తగా అభివృద్ధి చేసిన మాత శిశువు సూపర్ స్పెషాలిటీ సేవల విభాగం అయిన కిమ్స్ కడల్స్ ఆస్పత్రిని కిమ్స్ గ్రూప్ సిఎండి డా. భాస్కర రావు శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మాతా శిశు సంరక్షణలో ఇది సరికొత్త అధ్యాయం. రాయలసీమ ప్రాంతవాసులకు స్త్రీలు మరియు పిల్లల సంరక్షణ విషయంలో అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందించడానికి కిమ్స్ కడల్స్ ఆస్పత్రి కర్నూలుకు వచ్చిందన్నారు. ఇక్కడ నియోనాటల్ ఐసీయూ, పీడియాట్రిక్ కార్డియాలజీ, పీడియాట్రిక్ న్యూరాలజీ, పీడియాట్రిక్ నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ,పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జరీలు కూడా వస్తాయి. ఇకపైసీమ వాసులకు కర్నూలులోనే ఇవన్నీ అందుబాటులోకి వస్తాయి. అత్యాధునిక వైద్య పరికరాలు కూడా ఉండటంతో అన్నిరకాల వైద్య పరీక్షలు ఇక్కడే చేయించుకోవచ్చు. ఎలాంటి సంక్లిష్టమైన ప్రసవాల కేసులైనా ఇక్కడి నిపుణులైన వైద్యులు చూస్తారు' అని చెప్పారు. ఇకపై తల్లులు, చంటిపిల్లల ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి సంక్లిష్టమైన సమస్యలకైన పరిష్కారం దొరుకుతుంది. ఈకార్యక్రమంలో రీజనల్ హెడ్ కిశోర్‌రెడ్డి, సీవోవో డా. సునీల్,డా.సుధాకర్, డా. రఫీక్ అహ్మద్, డా. గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ప్రధాన రహదారిపై...అడ్డగోలుగా గొర్రెల సంత

విశాలాంధ్ర-కోడుమూరు: కోడుమూరుపట్టణంలోని కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారి పైన క్షణం కూడా తీరిక లేకుండా వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్ర మైన కర్నూలు నుంచి పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గా లతో పాటు అనంతపురం జిల్లా గుంతకల్,కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి,రాయచూరు జిల్లాలకు కోడుమూరు పట్టణం ప్రధాన ముఖద్వారం. దీంతో కోడుమూరు మీదుగా నిత్యం ఆర్టీసీ బస్సులు, చిన్న చిన్న వాహనాలతో పాటు కంటైనర్లు,ఇసుక టిప్పర్లు, తదితర భారీ వాహనాలు ఈ ప్రధాన రహదారి మీదుగా రాక పోకలు సాగించడం వల్ల కోడుమూరులో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ము ఖ్యంగా కర్నూలు రోడ్డులోని స్టేట్ బ్యాంకు ప్రాంతం నుంచి జీవిఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు పడుతున్న తీవ్ర ఇబ్బందులే కాకుండా,మహిళలు, వృద్ధులు, ప్రజలు రోడ్డు దాటేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే.. ట్రాఫిక్ సమ స్యకు తోడుగా ప్రతి శనివారం స్థానిక గూడూరు రోడ్డు ప్రాంతంలోని నబి టూరింగ్ టాకీస్ వద్ద నిర్వహించే గొర్రెల సంత కారణంగా అక్కడ ప్రతి వారం ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. కొంతకాలంగా ఉదయం 6గంటల నుండి ప్రధాన రహదారి పై అడ్డగోలుగా జీవాల వ్యాపారస్తులు గొర్రెల సంత నిర్వహిస్తూ వస్తున్నారు.దీంతో శనివారం ఉదయం వేళల్లో రోడ్డుపైనే నిర్వహించే గొర్రెల సంతతో ఆప్రాంతమంతా కోడుమూరు చుట్టు పక్కల మండలాల గ్రామాల నుండి గొర్రెలతో వచ్చే వ్యాపారస్తులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. అడ్డగోలుగా గొర్రెలవ్యాపరస్తులు జీవాలను రోడ్డుపై నిలబెట్టి,అడ్డదిడ్డంగా రోడ్డుపైనే పార్కింగ్ చేసిన ఆటోలు,బైకులతో ఇబ్బందులుతప్పడం లేదు. దీంతో ఏక్షణం ఏం జరుగుతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలుఅరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సివస్తుంది. ఇటీవలే శ్రీరాములవారి ఆలయం వద్ద రోడ్డుపై నిల్చున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టి ఈడ్చుకొని వెళ్లడంతో తీవ్రగాయాల పాలయ్యాడు.అక్కడ అడ్డదిడ్డంగాపార్క్ చేసిన కారును దాటించబోయి బైక్‌పై వెళుతున్న మరో యువకుడు బస్సు కింద పడి మృతి చెందిన సంఘటనలు వారం వ్యవధిలో చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా పోలీసులు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి,గూడూరు రోడ్డు నుంచి హైస్కూల్ వరకు ట్రాఫిక్ నిబంధనలను విధించి అవసరమైనచర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భవిష్యత్తుపై ప్రజల్లో ఇప్పుడిప్పుడే ఆశలు చిగురిస్తున్నాయి



విశాలాంధ్ర-కర్నూలు సిటీ: వైయస్ జగన్ ఆర్థికదోపిడికి పాల్పడి విస్తరాకులా ప్రజల జీవితాలు నాశనం చేశారని, సీఎంగా చంద్రబాబు 30 రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ..భవిష్యత్తుపై ప్రజలకు ఆశలు చిగురింప చేస్తున్నారని కర్నూలు పార్లమెంటు అధ్యక్షులు పి.తిక్కారెడ్డి చెప్పారు. ఆయన శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు, పార్టీ పార్లమెంట్ ప్రధానకార్యదర్శి ఎ.ప్రభాకర్, నాయకులు కె.వి.సుబ్బారెడ్డితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్రెడ్డి చిన్నాభిన్నంచేసి అప్పుల ఆంధ్రదేశ్‌గా మారిస్తే ఇటీవల ఎన్నికల్లో ఓటర్లు కోలుకోలేని దెబ్బకొట్టి ఇంటికి పంపారన్నారు. ప్రజాతీర్పుతో సీఎంగా జూన్ 12న పదవీ భాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయనడు డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీచేసేందుకు సంభందించి మొట్టమొదటి సంతకం, జీవో. నెం. 1 ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్లను పెంపు, నూతన ఇసుక పాలసిలాంటిబృహత్తర కార్యక్రమాలు చేపట్టారన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలకు సంభందించిన పనులను పునఃప్రారంభం, అగస్టులో అన్నాక్యాంటీన్ల ను పునః ప్రారంభం. కర్నూలు జిల్లాకు సంభందించిన పెండింగ్ ప్రాజెక్టుల గురించి ప్రపంచ బ్యాంకు నిధులతో పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేయుచున్నారనీ, త్వరలో కార్యరూపంలోకి రానున్నాయ వివరించారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 14, జూలై 2024

చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నందికొట్కూరు: పగిడాల మండలం ముచ్చుమర్రిలో మానవ మృగాలకు బలైన చిన్నారి కుటుంబాన్ని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక కనీసం బ్రతికి ఉందా, చని పోయిందా అని ఆరు రోజులైనప్పటికీ ఈ ప్రభుత్వంలో ఉన్న పోలీసులు ఇంతవరకు తేల్చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన జరిగి ఆరు రోజులైనప్పటికీ వాసంతి జాడ కనబడలేదని, నిందితుల తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారిస్తే తప్ప ఈ కేసు వీడుతుందని ఆయన అన్నారు. తమ ప్రభుత్వంలో ఇటువంటి ఘటన జరిగితే ఇదే హెూం మంత్రి అనిత హద్దు అదుపు లేకుండా మాట్లాడారని, ఈ ఘటనపై ఇంతవరకు స్పందించకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రంలో ఉన్న మహిళలకు అండదండగా ఉంటామని చెప్పడం జరిగిందని, అండగా ఉండడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఆరు రోజులైనప్పటికీ కనీసం బాలిక చనిపోయిందా ఉందా అనే క్లారిటీ ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ముచ్చుమరికి ఎవరిని రానివ్వకుండా చూస్తున్నారని, ఏపీ మాజీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సొంత గ్రామమైనప్పటికీ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చినప్పటికీ ఆయనను బ్రాహ్మణ కుట్కూరులో పోలీసులు అడ్డుకోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం చేసి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ముచ్చుమర్రి గ్రామంలో చిన్నారిని అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్‌చేశారు. శనివారం రాత్రి సీపీఐ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కొవ్వత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి హత్య జరిగి వారం రోజులైనప్పటికి నేటికి మృత దేహాన్ని గుర్తించకపోవడం దారుణమని, పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి కలుగజేసుకున్నప్పటికి ఎలాంటి ఆచూకీ లేదని, నిర్లక్ష్యం వహించిన సీఐని, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మైనర్ బాలికని అత్యాచారం, ఆపై హత్య చేసి మల్యాల ఎత్తిపోతల కాలువలో పడవేసినట్లు మైనర్ బాలురే చెబుతుంటే ఇంతవరకు అమ్మాయి జాడ కనపడటం లేదన్నారు. ఎంపీ సొంత గ్రామంలో గంజాయి, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభిస్తున్నాయని స్వయంగా కొందరు నాయకులు ఆరోపిస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పోలీసులు హత్యపై రోజుకో కథలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో మహిళలే కాకుండా చిన్నారి బాలికలకు సైతం రక్షణ కరువైందని, వెంటనే హత్యకు గురైన బాలిక ఆచూకీ కనిపెట్టాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ముచ్చుమర్రి గ్రామంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.మున్ని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గోకారి, సీపీఐ నాయకులు ఎస్ ఖలీల్, చాంద్ బాష, కరీముల్లా, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన ఎస్పీగా జి.బిందుమాధవ్

విశాలాంధ్ర - కర్నూలు: రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాకు నూతన ఎస్పీ జి.బిందు మాధవ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదివరకు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.కృష్ణ కాంత్‌ను నెల్లూరు జిల్లాకు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జి.బిందు మాధవ్‌ను నియమించింది.

పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఈ మధ్య కాలం లో పదవీ విర మణ పొందిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆదోని రీజియాన్ ఆధ్వ ర్యంలో సన్మాన కార్యక్రమం శనివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి హాజరై, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రామయ్యలను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు చేసిన సేవలు కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పించేది ఉపాధ్యాయులేనన్నారు. కార్యక్రమంలో ఎస్టియు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగరాజు రామ్మోహన్ రెడ్డి,రమేష్ నాయుడు,వీర చంద్ర యాదవ్, వెంకటస్వామి, చిరంజీవి రెడ్డి, లొక్య నాయక్, కాశీ విశ్వనాథ్ శాస్త్రి,నరసింహులు,రవి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు, అతిసార తదితర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి తస్లీమా సుల్తానా తెలిపారు. శనివారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సీజనల్ వ్యాధుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించ వ్చని, దీని ద్వారా ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. అతిసార నివారణకు కాచి వడ బోసిన నీరు త్రాగడం ద్వారా, ఓఆర్ఎస్, జింక్ మాత్రలు వాడాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, సీహెచ్‌వోలు తేజ, మానస, ఏఎన్ఎం సుభాషిణి, ఆశా కార్యకర్తలు రమాదేవి, పీరమ్మ, లక్ష్మినరసమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రానికి సమీపంలో వెలిసిన శ్రీ వాసాపుర వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి కుంకుమార్చన, ధూప దీప నైవేద్యాలతో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి నంద్యాల జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు వేలాదిగాతరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన వందలాది మంది భక్తులకు దాతలు అల్పాహారాన్ని, అన్నదానము ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కోశాధికారి కానాల ఈడిగ నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీ.. ఒకరు మృతి

విశాలాంధ్ర-కర్నూలు క్రైం : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్ర వారం రాత్రి రోడ్డు దాటుతుండగా పెద్దపాడు నుండి అతివేగంగా గుర్తుతెలియని కారు ఢీ కొట్టడంతో సోమేశ్వరమ్మ (55) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందిందని,ఆమె కూతురు ప్రశాంతి (35)కి గాయాలపాలైనట్లు కర్నూలు ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపారు. శుక్రవారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో అంబికా మెటల్ స్టోర్స్ షాపు ముందు ఉన్న బంకును మూసివేసి సోమేశ్వరమ్మ, తన కూతురు ప్రశాంతి ఎస్టీ ఆర్ బిల్డింగ్ లోని తమ ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పెద్దపాడు వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు అతివేగంగా, అజాగ్రత్తగా, నడుపు కుంటూ వచ్చి రోడ్డు దాటుతున్న సోమేశ్వరమ్మను, తన కూతురు ప్రశాంతిని ఢీ కొనగా సోమేశ్వరమ్మ అక్కడికక్కడే మృతిచెందారని సీఐ తెలిపారు. ఈప్రమాదంలో కూతురు ప్రశాంతి కి దొకుడు గాయములు, రక్తగాయాలు కాగా, ప్రశాంతినీ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆక్సిడెంట్ చేసిన కారును ఎవరైనా చూసి ఉన్నా లేక ఆ సమయంలో ఎవరైనా ఫోటోలు గానీ వీడియోలు కానీ తీసి ఉన్నా , కారు నంబర్ ను కర్నూలు ట్రాఫిక్ పోలీస్ వారికి తెలపగలరని సీఐ కోరారు. 90003 34894 , 98482 20844 నంబర్లకు ఫోన్ ద్వారా తెలపగలరని కోరారు.

ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవి స్వామి నాయక్‌కే ఇవ్వాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన దుమావత్ స్వామి నాయక్‌కు ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని గిరిజన సమాఖ్య నాయకులు కోరుతున్నారు. శనివారం స్థానిక కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్వామి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్య అనుచరుడైనా దుమావత్ స్వామి నాయక్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. నంద్యాల మండలం, కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అభాండం తండాకు చెందిన దుమావత్ లక్ష్మి నాయక్ 1982 నుంచి పార్టీ గెలుపు కోసం కీలకంగా పనిచేశారు. తండ్రి లక్ష్మి నాయక్ మరణాంతరము ఆయన మార్గంలోనే నడుచుకుంటూ దుమావత్ స్వామి నాయక్ ఎన్నో ఒడిదుడకులను ఎదుర్కొని పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్నారు. 2012లో స్వామి నాయక్ తండ్రి లక్ష్మి నాయక్ మరణాంతరం గ్రామంలో దుమావత్ స్వామి నాయక్ టీడీపీకి కీలకంగా మారారు. కార్యకర్తగా పార్టీలో ఉంటూ 2014లో టీడీపీ అధికారంలోకి రావడానికి తన వంతు శాయశక్తులా కృషి చేశారన్నారు. 2017లో జరిగిన నంద్యాల ఉప ఎన్నిక, 2019లోని జనరల్ ఎన్నికల్లో తన గ్రామంలో టీడీపీకి మంచి మెజార్టీని తెప్పించి, ప్రస్తుత న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆశీస్సులు పొందారున్నారు. తన సేవలను టీడీపీ ప్రభుత్వం గుర్తించి 2014లో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రజలతో, ప్రజా సంఘాల నాయకులతో మంచి సంబంధాలున్న స్వామి నాయక్ ను 2022లో టీడిపి గుర్తించి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధిగా ఎన్నుకోవడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న తండాల్లో విస్తృతంగా పర్యటించి, గిరిజనులను టీడీపీ ఓటర్లుగా మరల్చడంలో కీలక పాత్ర పోషించారని సమైక్య నాయకులు కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి మంత్రి ఫారూఖ్ ముఖ్య అనుచరుడిగా ఉంటున్న దుమావత్ స్వామి నాయక్, పార్టీకి చేసిన సేవలను గుర్తించి నాయకత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని స్వామి నాయక్ అభిమానులు నంద్యాల జిల్లా మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డికి విన్నవిస్తున్నారు.

ఊరు వాకిలి నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - తుగ్గలి : అదొక మారుమూల గ్రామం. మండల సరిహద్దు గ్రామం. పత్తికొండ నియోజక వర్గానికి ఎంతోమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు వచ్చారు, పోయారు. గ్రామం మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. మండల పరిధిలోని కడమకుంట్ల పంచాయితీ హుసేనాపురం గ్రామానికి కిలో మీటర్ మేరా సైతం రోడ్డు వేయలేదంటే నమ్మలేని నిజం. ఇప్పుడు ఆ గ్రామానికి మంచిరోజులు వచ్చాయి. గ్రామ ముఖద్వారంకు సర్పంచ్ భర్త బొజ్జులు, కుమారుడు సీపీఐ మండల నాయకుడు సుల్తాన్‌లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల నాయకుడు సుల్తాన్ మాట్లాడుతూ ఊరు తుగ్గలి, పగిడిరాయి, కొత్తూరు దాటిన తర్వాత కడమకుంట్ల మధ్యలో రోడ్డు నుండి కిలోమీటరులో హుసేనా పురం వస్తుందని, ఇంతవరకు ఆ కిలో మీటరుకు రోడ్డు లేదు మా గ్రామస్తుల సహకారంతో ఊరి వాకిలి నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోజ్జులు, దస్తగిరి, పెద్ద పూజారి కాసిం, గొర్ల పెద్ద భాష, మోటా రజాక్ , కమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-హెూళగుంద: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని టిడిపి నాయకులు పంపావతి, జాకీర్, తిప్పన్న, వెంకటేష్, ఎర్రిస్వామిలు శనివారం డిమాండ్ చేశారు. ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ బి.వీరభద్ర గౌడను క్యాంపు కార్యాలయంలో కలిసి మండలంలో రోడ్లు, తాగునీరు, వైద్య విద్య తోపాటు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని కోరారు అలాగే సాగు త్రాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు వేదవతి సాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు వీరభద్ర గౌడ్‌కు విన్నవించారు. వీరభద్ర గౌడ్ కలిసిన వారిలో టీడీపీ నాయకులు హుస్సేన్ పీరా, భాస్కర్, జిలాన్, బసప్ప, మహమ్మద్, పాల్గొన్నారు ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్ర గౌడ మాట్లాడుతూ వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహాయ సహకారంతో పాటు పడతానని పేర్కొన్నారు నియోజకవర్గ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర-ఆస్పరి : మండలంలోని వివిధ గ్రామాల్లో మొహరం వేడుకలను హిందూ, ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ హనుమం తప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ హనుమంతప్ప మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలు మేరకు మండలంలో వలగొండలో మొహరం వేడుకలకు అనుమతించలేదన్నారు. ఆస్పరి, ముత్తుకూరు, బిల్లేకల్లు, హలిగేర, కారుమంచి, చిరుమాన్ దొడ్డి గ్రామాలను సమస్యాత్మక రామానుగ గుర్తించడం జరిగిందని అక్కడ ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తామన్నారు. పలు గ్రామాల్లో మొహర్రం వేడు కల్లో భాగంగా పీర్ల స్వాములను ప్రతిష్టించడం జరిగిందన్నారు. పీర్ల పండుగలో ఎవ్వరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హనుమంతప్ప హెచ్చరించారు.

ముళ్ళ పొదలు తొలగించండి..

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ, మాయ లూరు ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి, భీమునిపాడు, ఆర్. జంబుల దిన్నె రహ దారిలో ముళ్ళ పొద లు రోడ్డుకి ఇరువైపులా అలుముకున్నాయి. ఈ రహదారుల్లో నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతూ ఉంటాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న తరుణంలో లోపల ఉన్న ప్రయాణికులకు కిటికీలకు ఉన్న అద్దాల ద్వారా ముళ్లపొదలు లోపలికి వెళ్లి తగులుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ళ పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెద్దకడబూరు: వైసీపీ ప్రభుత్వం ఓడిపోయిందని కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, అండగా ఉంటానని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం పెద్దకడబూరు గ్రామంలోని శ్రీ రామ లింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ మండల స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరయ్యారు. సాధారణ ఎన్నికల తర్వాత పెద్దకడబూరు మండలంలో జరిగిన మండల స్థాయి సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయ కులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా కార్య కర్తలనుద్దేశించి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన నా ఓటరు దేవుళ్ళకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రమంత ఎన్డీఏ కూటమి గాలి వీచినా మంత్రాలయం నియోజకవర్గ ప్రజలు 12,823 మెజారిటీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించడంపై నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. అయితే వైసీపీ ఓడిపోయిందని వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, మీకు ఏ కష్టమొచ్చినా మీ వెన్నంటే ఉంటానని హామీ ఇచ్చారు. తాను టీడీపీ, బీజేపీ పార్టీల ఏదో ఒకదాట్లో చేరుతాననే జరుగుతున్న ప్రచారాన్ని ఎమ్మెల్యే ఖండించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు రామాంజ నేయులు, చంద్ర శేఖర్, నాగరాజు, ఇస్మాయిల్, హనుమంతు, దస్తగిరి, చిన్న మహాదేవ, మాజీ ఎంపీపీ రఘురామ్, మాజీ ఎంపీటీసీ కెపి.యల్లప్ప, వైసీపీ నాయకులు పూజారి ఈరన్న, జాము మూకయ్య, రామలింగా రెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి, శివరామరెడ్డి, నవీన్ రెడ్డి, మహదేవ, మూకిరెడ్డి, యంకప్పస్వామి, నాగలాపురం హనుమంతరెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, దేవదానం, కోతి పెద్దయ్య, అళ్లయ్య, బాపురం హనుమంతరెడ్డి, గాదిరెడ్డి, నాగేంద్ర గౌడ్, యోగేంద్ర గౌడ్, నౌలేకల్ వెంకటేష్, నాగరాజు, అంజినయ్య, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ రాతిదేవాలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ రాతి దేవాలయంనకు పెరవలి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పోతుల పురుషోత్తం చౌదరిల కుటుంబ సభ్యులను శ్రీకృష్ణ రాతి దేవాలయ నిర్మాణ పెద్దలు దేవాలయ నిర్మాణానికి మీ యొక్క సహాయ సహకారాలు అందించాలని కోరగా శనివారం పురుషోత్తం చౌదరి శ్రీకృష్ణ రాతి దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా రూ 1,11,116 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ నిర్మాణ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర-కల్లూరు: పీర్ల పండుగను కుటుంబ సమేతంగా శాంతియుతంగా జరుపుకోవాలని సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఒకరికొకరు సమన్వయం పాటించి పండగలు జరుపుకోవాలని ఎస్సై నరేష్ సూచించారు. ఈ మేరకు మండల పరిధిలోని చిన్నటేకూరు, ఉలిందకొండ, బస్తిపాడు, పుసులూరు బొలవరం తదితర గ్రామాలను ఎస్సై తన సిబ్బందితో సందర్శించి పీర్ల పండగ ఏర్పాట్లపై మత పెద్దలతో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎవరైనా అల్లర్లు సృష్టించిన ఇతరులను ఇబ్బందులకు గురిచేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేడుకలు నిర్వహించుకునేటప్పుడు ప్రతి గ్రామంలో పోలీస్ సిబ్బందిని నిర్వహించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఆయనతోపాటు ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు ప్రజాప్రతినిధులు మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చీలికలు తెచ్చే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : హిందువుల్లో విద్వేశం కలిగించి చీలికలు తెచ్చే ప్రయత్నం చేసే ఏ ఒక్కరిని, వదిలిపెట్టేది లేదని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక దేవి ఫంక్షన్ హాల్లో హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, జిల్లా బ్రాహ్మణ సంఘాల ప్రతినిధుల సమావేశం బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర కో - ఆర్డినేటర్ దేవళ్ళ సాయినాథ్ శర్మ అధ్యక్షతన జరిగింది. బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ పార్వతి పురానికి చెందిన పైలా దాస్ అలియాస్ జనార్ధన్ సామాజిక మాధ్యమాలలో హిందూ దేవి, దేవతలను కించపరుస్తూ, బ్రాహ్మణ జాతిని అవమానపరుస్తూ ప్రచారం చేసి, హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ, హిందువుల మధ్యన విద్వేషం కలిగించి చీలికలు తేవాలని ప్రయత్నం చేస్తున్నాడనీ తెలిపారు. ఆయనపై వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేవళ్ళ సాయినాథ్ శర్మ మాట్లాడుతూ పైలా దాసు చేస్తున్న అసత్య ప్రచారానికి నిరసనగా కర్నూలు నగరంలో 15న వినాయక ఘాట్ దేవాలయం నుండి కర్నూలు జిల్లా కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ, అనంతరం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక సంస్థల,ఆధ్యాత్మిక సంస్థల, హిందూ కుల సంఘాల ప్రతినిధులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో కొలుకుల చంద్రశేఖర్, రామరాజు, శ్యామ సుందర్ శర్మ, కె.నరేష్, పవన్ శర్మ, సునీల్ శర్మ, రాఘవేంద్ర శర్మ, శివ సుబ్రహ్మణ్య, శంకర్ దత్త, సునీల్, వినోద్, విష్ణు, హరి శర్మ, ప్రవీణ్ పవన్, శివ సాయినాథ్ పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం పాటలు

విశాలాంధ్ర - రుద్రవరం : మండలంలోని ఎల్లా వత్తుల గ్రామంలో శని వారం నిర్వహిం చిన దేవాలయ భూముల కౌలు వేలం పాటలో రూ.1,14 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, నాగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి 49.50 ఎకరాల భూములున్నాయన్నారు. ఇందుకు సంబంధించి గత ఏడాది వేలం పాటలు నిర్వహించగా రూ.4.56 లక్షలు వచ్చిందన్నారు. ఈ ఏడాది రూ.5.70 లక్షలు వచ్చిందన్నారు. ఈవో చంద్ర, సర్పంచ్ చంద్రమోహన్, కార్యదర్శి పాములేటి, ఎంపీటీసీ కాశన్న పాల్గొన్నారు.